పునఃప్రారంభమైన పాఠశాలలు

- వేసవి సెలవుల అనంతరం తరగతులకు హాజరైన విద్యార్థులు
- విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాల పంపిణీ



పోరంకి పాఠశాల తరగతి గదిలో విద్యార్థులు

పెనమలూరు: వేసవి సెలవుల అనంతరం మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. ఆయా గ్రామాల్లో విద్యార్థులు ఉదయం తొమ్మిది గంటలకల్లా పాఠశాలలకు హాజరయ్యారు. మండల పరిధిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఆరు, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు 30 ఉన్నాయి. దాదాపు ఆరున్నర వేల మంది పేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. నాడు–నేడుతో అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించారు. కాగా ఉదయం తరగతులు ప్రారంభం కాగానే ఉపాధ్యాయులు విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై పలు సూచనలు చేశారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు తరగతులు నిర్వహించారు.

పాఠశాలల్లో సందడి..

చాలా రోజుల తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో సందడి కనబడింది. వేసవి సెలవులు, ఎన్నికల కారణంగా పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో రాజకీయ వాతావరణం ఏర్పడింది. ఎన్నికలు ముగిసి తిరిగి పాఠశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థులతో పాఠశాలలు కలకల్లాడాయి. ఈ విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉత్తమ మార్కులు సాధించే విధంగా తమ వంతు కృషి చేయాల్సి ఉంది.

విజయవాడరూరల్: వేసవి సెలవుల్లో విద్యార్థులు లేక బోసిపోయిన పాఠశాలలు విద్యార్థుల రాకతో కళ కళలాడుతున్నాయి. విజయవాడరూరల్ మండలంలో ప్రభుత్వ ఎలిమెంటరీ పాఠశాలలు 27, ప్రాథమికోన్నత పాఠశాలలు 6, హైస్కూల్స్ 7తోపాటు 46 ప్రైవేటు పాఠశాలలు గురువారం తిరిగి ప్రారంభమైనట్లు మండల విద్యాశాఖాధికారి–2 అజ్మీర్ సూరిబాబు తెలిపారు. ఈ పాఠశాలల్లో మొత్తం 24వేలపై చిలుకు విద్యార్థులుండగా కొత్తగా అడ్మిషన్లు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.



హెచ్‌ఎంకు అడ్మిషన్ పత్రాన్ని అందజేస్తున్న గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీను



విలేజీ కండ్రికలోని పాఠశాలలో విద్యార్థులు



పునాదిపాడు స్టాక్ పాయింట్ నుంచి తరలిస్తున్న పాఠ్యపుస్తకాలు

గన్నవరం: వేసవి సెలవుల అనంతరం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు గురువారం తెరుచుకున్నాయి. దీంతో పాఠశాలలు విద్యార్థులతో కళకళలాడాయి. పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో విద్యార్థుల చేరికలు కూడా ఊపందుకున్నాయి. నూతన విద్యావిధానం ప్రకారం ఎంపీపీ పాఠశాలలో రెండో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు మూడో తరగతి ప్రవేశాల కోసం జెడ్పీ హైస్కూల్స్ బాట పడుతున్నారు. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాలలో గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీను తన కుమారుడు హేమకేశసాయిని మూడో తరగతిలో చేర్చారు. ఈ మేరకు గురువారం తన కుమారుడి వివరాలు నింపిన అడ్మిషన్ పత్రాన్ని పాఠశాల హెచ్‌ఎం ఎస్.రవీంద్రభవానికి అందజేశారు. ఆయన కుమారుడు రెండో తరగతి వరకు పక్కనే ఉన్న రాయ్‌నగర్ ఎంపీపీ స్కూల్‌లో చదవడం గమనార్హం. గతంలో పాఠశాలల ప్రారంభం రోజునే జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ జరిగేది. అయితే ఈ ఏడాది ముందుగానే కిట్లు మండల విద్యాశాఖ కార్యాలయానికి చేరుకున్నప్పటికి గురువారం పాఠశాలలకు సరఫరా చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మరో రెండు మూడు రోజుల్లో జేవీకే కిట్ల పంపిణీ చేయనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

కంకిపాడు మండలంలో..

కంకిపాడు: కంకిపాడు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు గురువారం తెరుచుకున్నాయి. విద్యార్థుల అడ్మిషన్ల ప్రక్రియ కూడా వేగంగా జరుగుతోంది. పాఠశాలల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకూ విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠాలను బోధించారు.

పాఠశాలలకు చేరుతున్న పాఠ్యపుస్తకాలు..

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా విద్యాశాఖ నివేదిక ఆధారంగా ప్రభుత్వం నుంచి పాఠ్యపుస్తకాలను మండలంలోని పునాదిపాడు స్టాక్ పాయింట్‌కు చేర్చారు. ఒకటి నుంచి ఏడో తరగతి వరకు విద్యార్థులకు 16 వేల పాఠ్యపుస్తకాలు అవసరం. ఇప్పటికే 85 శాతం పైగా పుస్తకాలను స్టాక్ పాయింట్‌కు తరలించారు. దీంతో పాటుగా ఎనిమిది నుంచి 10వ తరగతి వరకు 17,523 పాఠ్యపుస్తకాలు అవసరం కాగా, 90 శాతానికి పైగా పుస్తకాలు స్టాక్ పాయింట్‌కు చేరాయి. తరగతులు, ఆయా తరగతుల్లో ఉండే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన పుస్తకాలను బండిల్స్ కట్టి గురువారం ప్రత్యేక వాహనాల్లో పాఠశాలలకు తరలించారు. పాఠ్యపుస్తకాలతో పాటుగా నోటు పుస్తకాలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఆరు నుంచి 10వ తరగతి వరకు 26,118 నోటు పుస్తకాలు కావాల్సి ఉండగా, ఆ మొత్తం పుస్తకాలు స్టాక్ పాయింట్‌కు చేరాయి. పాఠశాలల వారీగా నోటు పుస్తకాలు కూడా పంపిణీ చేశారు. తరగతులకు హాజరైన విద్యార్థులకు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాఠ్యపుస్తకాలను, నోటు పుస్తకాలను అందజేసే పనిలో పడ్డారు. పంపిణీ ప్రక్రియను మండల విద్యాశాఖ పర్యవేక్షిస్తోంది.

క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాలతో విద్యాప్రగతి



కంకిపాడు: అంగన్‌వాడీ కేంద్రాలతో విద్యాప్రగతి సాధ్యమవుతుందని ఐసీడీఎస్ కంకిపాడు ప్రాజెక్టు సీడీపీఓ కె.బేబి సుకన్య అన్నారు. కంకిపాడులోని పద్మావతి నగర్ 4వ అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను గురువారం నిర్వహించారు. అంగన్‌వాడీ విద్యను పూర్తి చేసుకున్న చిన్నారులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ బేబీ సుకన్య మాట్లాడుతూ చిన్నారులకు తొలి విద్య అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ప్రారంభమవుతుందని చెప్పారు. ఆట పాటలతో కూడిన విద్య అందుతుందన్నారు. విద్యాప్రగతి, క్రమశిక్షణకు అంగన్‌వాడీ కేంద్రాలు వేదిక అవుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎస్.అన్నామణి, ఎంఎస్‌కేలు రమా, షరాబీ, అంగన్‌వాడీ కార్యకర్తలు వై.నళినీకుమారి, డి.లక్ష్మి, కె.భవాని, ఎం.రత్నకుమారి పాల్గొన్నారు.

కొమ్మ కత్తిరింపులు చేసుకోవాలి

గన్నవరం రూరల్: మామిడి రైతులు కొమ్మ కత్తిరింపులు చేసుకోవాలని మండల హార్టీ కల్చర్ ఇన్‌ఛార్జి అధికారి హరిచంద్ సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ మామిడి తోటల్లో కొమ్మ కత్తిరింపులు చేసుకుంటే, చెట్లకు ఎండ, గాలి బాగా తగులుతుందని చెప్పారు. అదేవిధంగా ఎండిపోయిన కొమ్మలను వెంటనే తొలగించుకోవాలన్నారు. మామిడి చెట్లకు హాని చేసే క్రిమి కీటకాలు ఎండు పుల్లల్లో ఉంటాయన్నారు. అందుకే ఎండిన కొమ్మలను ఎప్పటికప్పుడు తీసివేయాలన్నారు. ఈ కారణంగా చెట్లు ఆరోగ్యవంతంగా ఉంటాయని వివరించారు. మంచి పూత వచ్చేందుకు ఈ సస్యరక్షణ చేసుకోవడం అవసరమని తెలిపారు. వాలిన కొమ్మలు తీసివేయడం ద్వారా మేలు కలుగుతుందని పేర్కొన్నారు.

సారవంతమైన నేలతో అధిక దిగుబడులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: వ్యవసాయ భూమి సారవంతంగా ఉన్నప్పుడే నాణ్యమైన పంటలు, అధిక దిగుబడులు సాధ్యమని బాపులపాడు మండల వ్యవసాయాధికారి జొన్నలగడ్డ భవాని అన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో భూసార పరీక్షలు, మట్టి నమూనాల సేకరణ చేపట్టినట్లు గురువారం ఆమె పేర్కొన్నారు. భూసార పరీక్షలు నిర్వహించడం వల్ల పంటలకు కావాల్సిన పోషకాలు తగిన మోతాదులో ఉన్నాయో లేదో తెలుసుకునేందుకు అవకాశం ఉందని చెప్పారు. భూమిలో సూక్ష్మ పోషకాల లోపం ఉన్నట్లయితే పంట దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని, దీన్ని ముందుగానే నిర్ధారించడం వల్ల తగిన చర్యలు తీసుకునేందుకు ఆస్కారం ఉంటుందని వివరించారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించి భూసార పరీక్షలను నిర్వహించనున్నట్లు ఏఓ భవాని తెలిపారు.

ఘనంగా ప్రారంభమైన సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): దావుబుచ్చయ్యకాలనీ శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి దేవాలయం సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఉదయం ఎనిమిది గంటలకు ఆలయ అర్చకులు 108 కలశాలతో శుద్ధ జలాభిషేకం, తిరుమంజనం సేవ నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు అర్చనలు వేద పండితుల మంత్రోచ్చరణలతో జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త అంగలూరి పద్మావతి పర్యవేక్షించారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మైనర్ అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌కు చెందిన ముస్లిం దంపతులకు ఇద్దరు సంతానం. వారి కుమార్తె(16) 8వ తరగతి వరకు చదువుకుంది. అయితే బాలిక ప్రవర్తన సరిగా లేకపోవడంతో చదువు మధ్యలోనే ఆపేసింది. ఈ నెల 9వ తేదీన రాత్రి భోజనాలు చేసిన తర్వాత అందరూ నిద్రపోగా తెల్లవారుజామున లేచి చూసేసరికి బాలిక కనిపించలేదు. దీంతో తన కుమార్తె కనిపించడం లేదని బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

15 నుంచి శ్రీవెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

పెనమలూరు: పోరంకి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో 20వ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది. ఈ మేరకు గురువారం వివరాలు తెలుపుతూ ఆలయంలో ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. 15వ తేదీ సుప్రభాతం, అగ్నిప్రతిష్ఠతో పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. సాయంత్రం సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహిస్తారు. 16న ప్రత్యేక పూజలు, 17న ఉదయం 10 గంటలకు త్రిదిండి అష్టాక్షరి సంపత్కుమార రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో శ్రీవారికి పంచామృత స్నపన, అష్టోత్తర శత కలశ స్నపన(108 కలశాలు), రాత్రి శ్రీవారి రాయబారోత్సవం జరుగుతుందన్నారు. 18వ తేదీ ఉదయం సువర్ణ పుష్పార్చన, రాత్రి 7 గంటలకు శ్రీవారికి తిరుకల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుందని తెలిపారు. 19వ తేదీ ఉదయం లక్ష మల్లెల అర్చన, పుష్పయాగం, ఉదయం 11 గంటలకు అఖండ అన్నసమారాధన ఉంటుందన్నారు. 20వ తేదీ ఉదయం నిత్యహోమం, మహాపూర్ణాహుతి, వసంతోత్సవం, చక్రతీర్థోత్సవం, సాయంత్రం శ్రీవారి రథోత్సవం ధ్వజ అవరోపణ, పవళింపుసేవ కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు.

దక్షిణామూర్తికి అభిషేకాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామివారి ఆలయం సమీపంలోని దక్షిణామూర్తికి గురువారం విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. గురువారం ఉదయం ఆలయ అర్చకులు దక్షిణామూర్తికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ వైదిక కమిటీ సభ్యుల పర్యవేక్షణలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు.

విద్యా కానుక కిట్ల పంపిణీ



ఉంగుటూరులో విద్యా కానుక కిట్లు అందజేస్తున్న ఎంఈఓ–2 సాంబశివరావు

ఉంగుటూరు: మండలంలోని తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు విద్యాకానుక కిట్లను మండల విద్యాశాఖ అధికారి–2 జె.సాంబశివరావు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు గురువారం పంపిణీ చేశారు. విద్యా కానుకలో రెండు జతల యూనిఫామ్స్, నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలు, బ్యాగ్‌లు, బెల్ట్‌లు అందజేశారు. యూపీ, ప్రైమరీ పాఠశాలకు విద్యాకానుక పుస్తకాలు శుక్రవారం అందజేయనున్నట్లు ఎంఈఓ తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు ఇందిర, కవిత, అమిత, నళిని, ఎంఎస్ కోఆర్డినేటర్ శారద, డేటా ఎంట్రీ ఆపరేటర్ శ్రీరాములు, వెంకటేశ్వరరావు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



వణుకూరు పాఠశాలలో విద్యార్థికి పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం

వణుకూరు పాఠశాలలో పాఠ్య పుస్తకాల పంపిణీ

పెనమలూరు: వణుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రఘురామ్ అన్నారు. పాఠశాలలో ఆయన విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసి వివరాలు తెలిపారు. పాఠశాలలో చదువుతున్న 140 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేశామన్నారు. విద్యార్థులకు అందించాల్సిన కిట్లు పూర్తిగా అందజేస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు శ్రద్ధతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నదిలో దూకి మహిళ ఆత్మహత్య

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ నగరానికి చెందిన ఒక మహిళ నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గురువారం మధ్యాహ్నం ఒక మహిళ ప్రకాశం బ్యారేజీ నుంచి 55వ ఖానా నుంచి నదిలోకి దూకింది. కొద్దిసేపటికి సమాచారాన్ని తెలుసుకున్న బ్యారేజీ సమీపంలోని ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది బోట్ ద్వారా నదిలో ఆమె దూకిన పరిసర ప్రాంతాల్లో వెతికారు. మృతదేహాన్ని గుర్తించి, బయటకు తీసి వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఆమె వివరాలు తెలియకపోవడంతో పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మృతి చెందిన మహిళ కానూరుకు చెందిన వ్యక్తిగా తెలిసింది. ఆమె భర్త మునునూరు శ్రీనివాసరావు స్టేషన్‌కు వచ్చారు. మృతురాలి పేరు పద్మిని(52)గా పేర్కొన్నారు. భార్యభర్తలు కానూరులో నివాసముంటున్నారని, వారి కుమారుడు అమెరికాలో ఉన్నట్లుగా పేర్కొన్నారు. అయితే పద్మిని కొంత కాలంగా షుగర్ వ్యాధి తీవ్రతతో బాధపడుతున్నట్లుగా, ఇతర అనారోగ్య సమస్యలు కూడా ఉండటంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు భర్త, ఇతర బంధువులు పోలీసులకు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మధ్యాహ్న భోజన పథకం తనిఖీ

పెనమలూరు: ప్రభుత్వ పాఠశాలలు గురువారం నుంచి పునఃప్రారంభం కావడంతో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈఓ బి.శేషగిరిరావు పరిశీలించారు. గోసాల మండల పరిషత్ పాఠశాలలో ఆయన మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ శేషగిరిరావు మాట్లాడుతూ ప్రభుత్వ మెనూ ప్రకారం మధ్యాహ్నం భోజన పథకం అమలు చేయాలని సూచించారు. పాఠశాలకు వచ్చే విద్యార్థులందరు భోజన పథకం సద్వినియోగం చేసుకునే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని సూచించారు.



గోసాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ శేషగిరిరావు

శ్రీనివేదిత గురుకుల పాఠశాల ప్రారంభం

ఉంగుటూరు: గురుకుల పాఠశాల విద్యావిధానం ద్వారా విద్యార్థులు తల్లిదండ్రుల పట్ల గౌరవ మర్యాదలతో నడుచుకునే జీవన విధానం అలవర్చుకుంటారని జయరామ ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ, మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకట బాలవర్ధనరావు అన్నారు. ఉంగుటూరులోని జయరామ విజ్ఞాన విహార పాఠశాల ప్రాంగణంలో నెలకొల్పిన శ్రీనివేదిత గురుకుల పాఠశాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ చదలవాడ సుధా, నాగేశ్వరరావు నివేదిత ప్రాముఖ్యత, ప్రాచీన శాస్త్రజ్ఞుల గురించి వివరించారు. గురుకుల పాఠశాల విద్యాభ్యాసం వారి భవితకు పునాది వంటిదని తెలిపారు. శ్రీనివేదిత గురుకులం విశిష్టమైనదని బాలికలకు విద్యాబుద్ధులతో పాటు చతుషష్టి 64 కళలను బోధిస్తారని వివరించారు. కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, విజ్ఞాన విహార అధ్యక్షుడు బీవీఎస్‌టీ సాయి, గోవిందరావు, హెచ్‌ఎం సావిత్రి పాల్గొన్నారు.



గురుకులాన్ని ప్రారంభిస్తున్న బాలవర్ధనరావు, నాగేశ్వరరావు

నగరం సకల కళల సమాహారం

- నిత్యం సంగీతామృత జడిలో శ్రోతలు
- రంగస్థలంపై నట దిగ్గజాల ప్రదర్శనలు
- సంప్రదాయ, పాశ్చాత్య కళల సమన్వయం
- కళాభిమానులకు కనుల విందు



డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు కళావేదిక

విజయవాడకల్చరల్: విజయవాడ నగరం సకల కళల సమాహారం. సంగీతం, సాహిత్యం, నృత్యం, చిత్రలేఖనం ఏ రంగంలో చూసుకున్నా నగరం రాష్ట్రంలో ఇతర ఏ నగరంతో పోల్చినా ప్రథమ స్థానంలోనే ఉంటుంది. నిత్యం ఇక్కడ సినీ సంగీత విభావరులు, సంగీత కార్యక్రమాలు, జాతీయ స్థాయి నాటికల పోటీలు, నృత్య కార్యక్రమాలు, చిత్రలేఖన పోటీలు జరుగుతుంటాయి. పలుమార్లు ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు నిర్వహించిన ఘనత విజయవాడ నగరానిదే. దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజల సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించే సంప్రదాయ వస్త్ర ప్రదర్శనలు కూడా అడపాదడపా జరుగుతూ ఉంటాయి. వారి కళా ప్రదర్శనలకు అవసరమైన కళాకేంద్రాలు దాదాపు 15 పైగానే ఉన్నాయి. 2 వేల మందికి పైగా కళాకారులు, 200 కళా సంస్థలు కార్యక్రమాలను నిర్వహిస్తూ ఉంటాయి. కళాకారుల సౌలభ్యం కోసం వాటి వివరాలను 'సాక్షి' పాఠకులకు అందిస్తున్నాం.

డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు కళాకేంద్రం : గాంధీనగర్‌లోని ప్రధాన కళాకేంద్రం దీన్ని హనుమంతరాయ గ్రంథాలయం అని కూడా పిలుస్తున్నారు. ప్రతి రోజూ ఇక్కడ ఏదో ఒక కార్యక్రమం జరుగుతూ ఉంటుంది. జాతీయ స్థాయి నాటికల పోటీల సాంస్కృతిక సదస్సులు నిర్వహిస్తూ ఉంటారు. 80 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఈ వేదిక సీటింగ్ కెపాసిటీ 400. ఫోన్ : 94400 35484.

అందుబాటులో ఉన్న ఇతర కేంద్రాలు:

విజయవాడ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం, బందరురోడ్డులోని ఠాగూర్ మెమోరియల్ గ్రంథాలయం. బాలోత్సవ్ భవన్, మాకినేని బసవపున్నయ్య కళాకేంద్రం, మొగల్‌రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాలలోని సిద్ధార్థ కళాపీఠం, సత్యనారాయణపురంలోని సీతారామ కల్యాణమండంలోని కళావేదిక మొదలైనవి కళాకారులకు అందుబాటులో ఉన్నాయి.

విద్యాభారతి శ్రవణ సదనం



విద్యాభారతి శ్రవణ సదనం

దుర్గాపురంలోని శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలో ఇటీవల ఆధునిక సౌకర్యాలతో విద్యాభారతీ శ్రవణ సదనం పేరుతో ఏర్పాటు చేశారు. ప్రధానంగా ఇక్కడ ఆధ్యాత్మిక కార్యక్రమాలు, పెద్ద స్థాయిలో సంగీత ఉత్సవాలు, సదస్సులు జరుగుతూ ఉంటాయి. సీటింగ్ కెపాసిటీ 700. ఫోన్ : 99493 07875

గోకరాజు గంగరాజు కళావేదిక



గోకరాజు గంగరాజు కళావేదిక

ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాల ఆధ్వర్యంలో కళావేదిక నడుస్తోంది. సినీ సంగీత విభావరులు, జాతీయ స్థాయి నృత్య కార్యక్రమాలు, ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు జరుగుతూ ఉంటాయి. చిన్న సంస్థలకు అందుబాటులో ఉంటుంది. సీటింగ్ కెపాసిటీ సుమారు వెయ్యి. ఫోన్ : 94412 79833

కొత్తా పూర్ణానందం కళావేదిక



కొత్తా పూర్ణానందం కళావేదిక

గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం ట్రస్ట్ నిర్వహణలో కళావేదిక నిర్వహిస్తున్నారు. ప్రధానంగా ఇక్కడ సినీ సంగీత విభావరులు నిర్వహిస్తూ ఉంటారు. సామాన్యులకు అందుబాటులో ఉంటుంది. సీటింగ్ కెపాసిటీ 200. ఫోన్ : 94901 96072

హిందూ భక్తుల భద్రతకు చర్యలు తీసుకోవాలి

కలెక్టర్‌కు వీహెచ్‌పీ నేతల వినతి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): జమ్ముకశ్మీర్‌లో హిందూ భక్తులపై జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ హిందూ భక్తుల భద్రతకు చర్యలు తీసుకోవాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ మహానగర్ కార్యదర్శి క్రోవి రామకృష్ణ ఆధ్వర్యంలో నేతలు గురువారం జిల్లా కలెక్టర్ ఢిల్లీరావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ విశ్వహిందూ పరిషత్ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్‌లకు వినతిపత్రాలు అందజేస్తున్నామన్నారు. ఈ నెల 9న జమ్ముకశ్మీర్‌లోని వైష్ణోదేవి ఆలయం నుంచి శివ్‌ఖోడికి హిందూ భక్తులు ప్రయాణిస్తున్న బస్సుపై ఇస్లామిక్ జీహాదీ ఉగ్రమూకలు దాడి చేయడం బాధాకరమని అన్నారు. ఈ దాడిలో 10 మంది భక్తులు ప్రాణాలు కోల్పోగా 30 మందికి పైగా గాయాలపాలయ్యారని అన్నారు. దేశంలో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిందిగా వినతిపత్రం ద్వారా కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ సహాయ కార్యదర్శి కొంపెల్లి శ్రీనివాస్, నేతలు సత్యనారాయణ, ఎ.శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ ఢిల్లీరావుకు వినతిపత్రం అందజేస్తున్న వీహెచ్‌పీ నేతలు

500 మందికి అన్న ప్రసాద వితరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో గురువారం బాపట్ల న్యాయమూర్తి సతీమణి ఆధ్వర్యాన 500 మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీర మోహనరావు బాబాకు ప్రత్యేక పూజలు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీసాయి నక్షత్ర మాలిక మండలి ఆధ్వర్యాన బాబా పారాయణం జరిగింది. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.